సాక్షి అనంతపురం

ఆదివారం । 14 । మే । 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 430 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టీబీ డ్యామ్‌కు ఇన్‌ఫ్లో

ఎగువన కురుస్తున్న అకాల వర్షాలతో టీబీ డ్యామ్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 3.190 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 1,193 క్యూసెక్కులు కొనసాగుతోంది.

గరిష్టం/కనిష్టం
40.4°/25.5°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం, ఉక్కపోత అధికంగా ఉంది. పశ్చిమ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

డ్వాక్రా లెక్క.. పక్కా!

- లావాదేవీల్లో మరింత పారదర్శకత
- అందుబాటులోకి 'లోకోస్' యాప్
- జిల్లా వ్యాప్తంగా మొదలైన శిక్షణ



లోకోస్ యాప్‌పై అవగాహన కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

రాయదుర్గం: డ్వాక్రా అక్కచెల్లెమ్మల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాల ద్వారా కృషి చేస్తున్నారు. సంఘాల బలోపేతంతో పాటు సభ్యులు స్వయం ఉపాధిలో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తోడ్పాటునందిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ, బ్యాంకు రుణాలు, పొదుపు వివరాల్లో మరింత పారదర్శకత పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 'లోకోస్' అనే కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ యాప్ ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న పొదుపు సంఘాలన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చేలా రూపకల్పన చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం (వైకేపీ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన పెంచేలా కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లాలోని 35,610 డ్వాక్రా సంఘాల్లో 3,75,000 మంది అక్కచెల్లెమ్మలు సభ్యులుగా ఉన్నారు.

క్షేత్రస్థాయిలో అవగాహన

వైకేపీ ఆధ్వర్యంలో మొబైల్ బుక్ కీపింగ్, డ్వాక్రా సభ్యుల వేలిముద్రలు, సంఘాల పని తీరు, ఇతర వివరాలను ఇప్పటికే అందుబాటులోనున్న యాప్‌ల ద్వారా నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. అయితే దీనికి భిన్నంగా 'లోకోస్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి లెక్కలన్నీ పక్కాగా మార్చేలా కృషి చేస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో సభ్యులకు అవగాహన కల్పించేందుకు మండలాల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించి, యాప్‌లో వివరాలు నమోదు చేయించే కార్యక్రమం వేగవంతం చేశారు.

జిల్లాలో డ్వాక్రా సంఘాల వివరాలు	
నియోజకవర్గాలు	8
డ్వాక్రా సంఘాలు	35,610
సభ్యులు	3,75,000
వీవోలు	1,342
మండల సమాఖ్యలు	31

లావాదేవీల్లో పారదర్శకత

డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో జరిపే ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెరిగేలా 'లోకోస్' యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పొదుపు సంఘాల్లో (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న వాయిదాల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. పొదుపు సంఘాల బాధ్యతలను ఆ పరిధిలోనున్న వీఓలు పర్యవేక్షిస్తుంటారు. వీరు కూడా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉండడంతో పారదర్శకత లోపిస్తోందని భావించి పక్కా వివరాల కోసం లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారని వైకేపీ అధికారులు చెబుతున్నారు.

పక్కాగా రుణ వివరాలు



మేము తీసుకున్న రుణం, సంఘంలో జరిపిన లావాదేవీలు మొత్తం 'లోకోస్' యాప్‌లో నమోదు చేస్తుండడంతో వివరాలన్నీ పక్కాగా మారబోతున్నాయి. దీని ద్వారా ఎక్కడా అవినీతి అన్నమాటే వినపడకుండా పారదర్శకతకు పెద్దపీట వేయనున్నారు. యాప్ గురించి తెలుసుకున్నా. రెండు రోజుల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని వీఓ తెలిపారు.

– వన్నూరమ్మ, డ్వాక్రా సభ్యురాలు, గొడిశెలపల్లి

జిల్లా వ్యాప్తంగా శిక్షణ



లోకోస్ యాప్ ప్రయోజనంపై వైకేపీ సిబ్బంది క్షేత్రస్థాయిలో డ్వాక్రా సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. డ్వాక్రా సభ్యులు తీసుకున్న రుణం, జరిపిన లావాదేవీల్లాంటి కీలక సమాచారం యాప్‌లో తెలుసుకోవచ్చు. అవకతవకలకు ఏమాత్రమూ తావుండదు. సభ్యుల చేరికలు, తొలగింపు సైతం గ్రామస్థాయిలోనే చేసుకోవచ్చు.

– నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, అనంతపురం

న్యూస్‌రీల్

పీఏబీఆర్‌లో నీటిమట్టం తగ్గుముఖం

- 3.510 టీఎంసీల నీరు నిల్వ



పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నుంచి అవుట్ ఫ్లో పెరగడంతో నీటి మట్టం రోజు రోజుకూ తగ్గుముఖం పడుతూ వస్తోంది. శనివారం నాటికి పీఏబీఆర్‌లో 3.510 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. జలాశయంలో ఇన్‌ఫ్లో ఏమాత్రమూ లేదన్నారు. మిడ్‌పెన్నార్ జలాశయానికి 114 క్యూసెక్కులు, సత్యసాయి, శ్రీరామిరెడ్డి, అనంతపురం, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 55 క్యూసెక్కులు, జలవిద్యుత్ ఉత్పత్తికి 28 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామన్నారు.

పండ్ల అలంకరణలో అంజన్న



గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో నాలుగో రోజు శనివారం వేకువజామున కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామికి అష్టోత్తర శత కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. తర్వాత వివిధ రకాల పండ్లతో అంజన్నను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. యాగశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించిన వేద పండితులు సాయంత్రం 5 గంటలకు ఉత్సవ మూర్తిని ఆలయ ముఖ మండపంలో కొలువుదీర్చి మల్లెపూలతో లక్షార్చన చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ డి.వెంకటేశ్వరరెడ్డి, ధర్మకర్త సుగుణమ్మ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని కొట్టాలపల్లి రోడ్డు సమీపాన ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4, 9వ తరగతుల్లో ఖాళీ సీట్లను బ్యాక్‌లాగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. 3వ తరగతిలో ఎస్టీలకు 40 సీట్లు, ఎస్సీలకు 30 సీట్లు, బీసీలకు-5, ఓసీలకు-2, దివ్యాంగులకు-1 చొప్పున ఖాళీ ఉన్నాయన్నారు. నాలుగో తరగతిలో 33, ఐదో తరగతిలో 30, ఆరో తరగతిలో 5, ఏడో తరగతిలో 7, తొమ్మిదో తరగతిలో 13 సీట్లు బ్యాక్‌లాగ్ ఖాళీలను ఎస్టీ విద్యార్థులతో మాత్రమే భర్తీ చేస్తామని తెలిపారు. లాటరీ పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- ఇద్దరు చిన్నారుల జలసమాధి
- రెండు కుటుంబాల్లో విషాదం
- మృతులు పార్నపల్లి వాసులు



కెనాల్ నుంచి మృతదేహాలను వెలికి తీస్తున్న ఈతగాళ్లు



మృతిచెందిన శివచరణ్, కుష్వంత్

యల్లనూరు: ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణం తీసింది. రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. యల్లనూరు మండలం శింగవరం గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగవరం గ్రామానికి చెందిన కుళ్లాయప్ప నూతన గృహ ప్రవేశ కార్యక్రమం శనివారం ఉదయం జరిగింది. వైఎస్సార్ జిల్లా లింగాల మండలం పార్నపల్లికి చెందిన పేతురు భార్య, తన ఇద్దరు కుమారులతో పాటు, రవీంద్రబాబు భార్య, ఇద్దరు కుమారులతో కార్యక్రమానికి హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం చేశాక పేతురు పెద్ద కుమారుడు కుశ్వంత్ (8), రవీంద్రబాబు చిన్న కుమారుడు శివచరణ్ (13) గ్రామ సమీపంలోని పులివెందులరాంచ్ కెనాల్‌లో ఈత కొడదామని వెళ్లారు. కెనాల్‌లో నీరు ఉధృతంగా పారుతోంది. ఆ నీటిలో దిగిన చిన్నారులు లోతట్టు ప్రాంతంలో నీట మునిగిపోయారు. ఆ సమయంలో చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో వారిని గమనించలేదు. కొంతసేపటి తర్వాత ఇంటి వద్ద కుశ్వంత్, శివచరణ్ కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అలా వెతుక్కుంటూ కెనాల్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ కుశ్వంత్, శివచరణ్ విగతజీవులై నీటిలో తేలియాడుతూ కనిపించారు. ఈతగాళ్లు వచ్చి మృతదేహాలను బయటకు తీశారు. దేవుడా ఎంత పనిచేశావయ్యా.. ముక్కుపచ్చలారని పిల్లలను తీసుకెళ్లిపోయావా అంటూ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బంధుమిత్రులు సైతం పిల్లలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం

- 5,200 టన్నుల సేకరణ లక్ష్యం
- 3 పీఏసీఎస్, 37 ఆర్బీకేల సహకారం

అనంతపురం అర్బన్: రైతు సంక్షేమమే లక్ష్యంగా జగన్ సర్కార్ చర్యలు చేపట్టింది. మద్దతు ధరతో జిల్లాలో ధాన్యం సేకరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ చైర్మన్‌గా ఏర్పాటైన జిల్లా సేకరణ కమిటీ (డిస్ట్రిక్ట్ ప్రొక్యూర్‌మెంట్ కమిటీ) కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ ప్రాంతాల్లో సేకరణకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇక్కడి మూడు పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లు, 37 రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల) పరిధిలో 5,200 టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మొదటి గ్రేడ్ రకం క్వింటాలు రూ.2,060, మొదటి గ్రేడ్ సాధారణ రకం రూ.2,040 చొప్పున రైతుల నుంచి ధాన్యం సేకరిస్తారు. జిల్లాలో సార్టెక్స్ మిల్లులు లేని కారణంగా ఇక్కడ సేకరించిన ధాన్యాన్ని చిత్తూరు, తిరుపతిలోని మిల్లులకు పంపించనున్నారు.

ఆర్‌బీకేల్లో నమోదు

ధాన్యం విక్రయించాలనుకునే రైతులు తమ పేరును రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ధాన్యం సేకరణకు సంబంధించిన నగదు నేరుగా రైతు ఖాతాలోకి ప్రభుత్వం జమ చేస్తుంది. రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబర్‌తో ఆధార్ అనుసంధానమైన బ్యాంక్ ఖాతా తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ వెంటనే సంబంధిత రైతు ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) క్రియేట్ అవుతుంది. మిల్లరు ధాన్యం తీసుకున్న వెంటనే ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. ఎఫ్‌టీఓ ఆధారంగా రైతు ఖాతాలోకి నగదు జమవుతుంది. నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం సేకరించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు పౌర సరఫరాల సంస్థ డీఎం నీలమయ్య తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నామన్నారు.

నేడు జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లకు సన్మానం

అనంతపురం క్రైం: 'జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగన్' అనే మెగా పీపుల్స్ సర్వేలో అనంతపురం జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. దీన్ని పురస్కరించుకుని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లకు ఆదివారం ఉదయం 10.30 గంటలకు అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లిలోని గ్రీన్ హండ్స్ రిసార్ట్‌లో సన్మాన కార్యక్రమం జరగనుంది. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జేసీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి హాజరు కానున్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

గుంతకల్లు రూరల్: పట్టణంలోని దోనిముక్కల రోడ్డు ఇందిరమ్మ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 65 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి శనివారం తెలిపారు. దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో మల్లికార్జున అనే వ్యక్తి తన ఇంట్లో 65 క్వింటాళ్ల (112 బస్తాలు) రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం అందిందన్నారు. విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ శేషగిరి, ఏఈఈ రాజశేఖర్‌తో కలిసి శుక్రవారం రాత్రి దాడులు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బేలోడు బాధితులకు పరామర్శ

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుమ్మఘట్ట మండ లం బేలోడు గ్రామస్తులను వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర సంచాలకుడు (డైరెక్టర్ ఆఫ్ హెల్త్) డాక్టర్ రామిరెడ్డి శనివారం పరామర్శించారు. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచార్‌ను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో విధులు నిర్వర్తించే వైద్యాధికారులకిచ్చే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అంకితభావంతో వైద్య సేవలందించాలన్నారు. శిక్షణలో సీనియర్ వైద్యులందించిన సలహాలను విధి నిర్వహణలో ఆచరణలో ఉంచాలన్నారు. డీఐఓ డాక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

తాడిపత్రి: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి చాకలి వెంకటేశ్వర్లు (26) మృతి చెందాడు. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా బేతంచెర్ల గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్వర్లు తిరుపతికి రైల్లో వెళ్తుండగా, తాడిపత్రి – చల్లవారిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ జారిపడి, మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అమ్మతనం..కమ్మదనం

సందర్భం



మాతృ దినోత్సవం

ఆడ జన్మ అపు 'రూప'ం.. ప్రేమకు ప్రతిరూపం.. ఆత్మీయతలు, అనురాగాలకు అందమైన నిర్వచనం.. మాటల్లో చెప్పలేని మధుర భావం.. బిడ్డగా జన్మించి, భార్యగా బాధ్యతలు పంచుకున్నా.. సాటిలేదు..సాటిరాదు.. అత్తమ్మగా అజమాయిషీ చేసినా.. అవసాన దశలో అమ్మమ్మగా మిగిలినా.. ఎన్ని పాత్రలు పోషించినా అమ్మ.. అమ్మే.. నవమాసాలు మోస్తుంది..లాలించి, పాలిస్తుంది.. కల్మషంలేని కమ్మని ప్రేమను పంచుతుంది.. అడుగులు తడబడితే ఊతమవుతుంది.. నడక నేర్పుతుంది.. నడత మారుస్తుంది.. మన కోసం ఇన్ని చేసిన అమ్మ ఎప్పటికీ ప్రత్యక్ష దైవం.. అందుకే అమ్మకు ఒక రోజు అంకితం చేద్దాం.. మాతృ దినోత్సవంగా జరుపుకుందాం..

- అనంతపురం కల్చరల్

విలువలతో పెంచా



మాది తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి నల్గొండ జిల్లా వలిగొండ మండలంలోని నాగారం గ్రామం. నాకు ఆరుగురు కూతుళ్లు ఒక కొడుకు సంతానం. మేము చదువుకోలేదు. మా బిడ్డలను ఉన్నతంగా చదివించాలని తపించేదాన్ని. వ్యవసాయ పనులు చేసుకుంటూనే పిల్లలకు సంపాదనకన్నా.. విలువలతో జీవించాలని నిత్యం చెప్తుండేదాన్ని. మా చిన్నమ్మాయి రజిత పురావస్తు శాఖ ఏడీగా అనంతకు రావడంతో మాకిక్కడ కూడా సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. నేనెప్పుడూ ఆడపిల్లలు తక్కువ అని కానీ, మగపిల్లలే ఉండాలని కానీ అనుకోలేదు. నేటికీ అమ్మాయిలు నా బాగోగులు చూసుకునేలా పెంచా. వారి పిల్లలతో కూడా అలాగే ఉండాలని చెపుతా. ఆడవాళ్లకు ప్రేమ మాత్రమే కాదు ధైర్యం చాలా అవసరం.

– అమృత, పురావస్తు శాఖ ఏడీ రజిత తల్లి

తల్లిప్రేమలో తారతమ్యం ఉండదు



ఆడవాళ్లంటేనే ఆప్యాయతలు, సున్నిత మనస్తత్వం కలిగి ఉంటారు. ఇంటి బాధ్యతలు ఎన్ని ఉన్నా.. బిడ్డలను ప్రేమగా చూసుకోవడంలో వ్యత్యాసం ఉండదు. నా భర్త సత్యనారాయణ మొదటి భార్య ఉష కేన్సర్‌తో చనిపోయింది. ఆమె కొడుకు విష్ణు తల్లిలేని పిల్లాడయిపోయాడు. నేను కాపురానికి వచ్చినప్పటికి అతనికి పదకొండేళ్లు. ఇక పిల్లలు వద్దనుకొని విష్ణునే నా సొంత బిడ్డలా పెంచుతున్నా. తల్లి ప్రేమలో తేడా ఉండదు. పిన్ని అయినా కొడుకును బాగా చూసుకుంటున్నావని అందరూ అంటుంటే సంతోషంగా ఉంటుంది. నాకైతే మా అబ్బాయి విష్ణునే లోకం. కోడలిని కూడా తల్లిలా చూసుకోవాలని మా అబ్బాయికి చెప్తుంటా.

– కౌస్తుభమణి, అనంతపురం

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నా..



స్వచ్ఛమైనది అమ్మ'తనం తొలి కాన్పులోనే వైకల్యంతో కొడుకు పుట్టాడు. వీడిని వదిలించుకుందామని భర్త రోజూ గొడవపడేవాడు. అయినా భర్తనే కాదనుకున్నా. పిల్లాడే లోకంగా బతుకున్నా. అసలే పేదరికం, దానికి తోడు సంపాదించే భర్త దూరమైనా ఆత్మస్థైర్యంతో నాలుగిళ్లలో పాచిపనులు చేసుకుంటూ దివ్యాంగుడైన కొడుకు సాయిని కంటికి రెప్పలా చూసుకుంటున్నా. నాలుగేళ్ల కిందట ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద అనాథగా వదిలేసి వెళ్లిపోయిన ఓ బిడ్డను కూడా అక్కున చేర్చుకొని పెంచుకుంటున్నా. ప్రభుత్వమందించే పింఛన్, 'అమ్మ' సంస్థ అందిస్తున్న ఆదరణే నాకు శ్రీరామరక్ష.

– రాజేశ్వరి, మూడోరోడ్డు, అనంతపురం

కొడుకు కోసం తాళి అమ్మేసింది



సనప గ్రామానికి చెందిన శివమ్మది మరో వేదనాభరిత జీవితం. భర్త వెంకటేష్ అనారోగ్యంతో ఇంటిపట్టునే ఉంటున్నాడు.కొడుకు విష్ణువర్ధన్ చిన్నతనంలో బాగున్నా 8వ తరగతి చదువుతున్నప్పుడు ఊపిరితిత్తుల సమస్య వచ్చింది. శస్త్ర చికిత్స చేయించినా ఫలితంలేదు. అలాగే కొడుకు వైద్యం కోసం ఆదరువుగా ఉన్న ఎకరా పొలాన్నే అమ్మేసింది. బంగారు తాళిబొట్టును కూడా అమ్మేసింది. రోజువారి వచ్చే కూలి రూ.300తో బతుకుపోరాటం సాగిస్తోంది. నెలసరి వైద్య ఖర్చులకే రూ.20 వేలు అవసరమవుతున్నా బిడ్డ కోసం ఆమె పడే తపన తల్లి ప్రేమంటే ఏమిటో వృద్ధాశ్రమాల్లో నిర్ధయగా వదిలేస్తున్న బిడ్డలు తెలుసుకోవాల్సిందే. కొడుకు ఆరోగ్యం కోసం బతుకు పోరాటం సాగిస్తున్న శివమ్మ లాంటి అమ్మలు ఎప్పటికీ ఆదర్శమే.

విద్యాభివృద్ధికి పెద్దపీట

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. శనివారం బుక్కరాయసముద్రం సచివాలయం ఎదుట ఉన్న ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలోని స్టాక్‌పాయింట్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను కలెక్టర్ పరిశీలించారు. పాఠ్యపుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగా పాఠాల వీడియోలు రావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కిట్‌లోని వస్తువులు నాణ్యతగా లేకుంటే వెనక్కు పంపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాడు– నేడు కింద చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభించే లోపు పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



జగనన్న విద్యా కానుక వస్తువుల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి..

బుక్కరాయసముద్రంలో సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న జగనన్న హౌసింగ్ కాలనీలో కలెక్టర్ పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. కాలనీలో విద్యుత్, తాగునీటి సమస్యపరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ సాయిరాం, జగనన్న విద్యా కానుక జిల్లా పరిశీలకుడు నాగేశ్వరరెడ్డి, హౌసింగ్ పీడీ కేశవ నాయుడు, డీఈఓ శ్రీమన్నారాయణ, ఎంఈఓ గురుప్రసాద్, ఐకేపీ ఏపీఎం మద్దిలేటి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, క్రాఫ్ట్, ఆర్ట్స్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మరోమారు బడుగులకు సముచిత స్థానం

- కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు కమిటీ చైర్‌పర్సన్‌గా దళిత మహిళకు అవకాశం
- నేడు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన చైర్ పర్సన్ తిమ్మరాజమ్మ



వైస్ చైర్మన్ దాసరి రామమోహన్ యాదవ్

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులు మరోసారి బడుగులకే కట్టబెట్టింది. ప్రస్తుత కళ్యాణదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి పదవీ కాలం ముగియడంతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ చైర్‌పర్సన్‌గా ఎస్సీ మహిళకు ఇవ్వగా, వైస్ చైర్మన్‌గా బీసీ (యాదవ కులానికి చెందిన) వ్యక్తికి ఇచ్చారు.

చైర్‌పర్సన్‌గా దళిత మహిళ..

కళ్యాణదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా శెట్టూరు మండలానికి చెందిన దళిత సీనియర్ నాయకుడు పోస్టు కిష్ట భార్య తిమ్మగానిపల్లి తిమ్మరాజమ్మకు దక్కింది. వైస్ చైర్మన్‌గా కంబదూరు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాసరి రామ్మోహన్ యాదవ్‌కు ఇచ్చారు.

నేడు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం..

కళ్యాణదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనుంది. ఇందుకు అధికారులు స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాట్లు చేశారు. కమిటీలో గౌరవ చైర్‌పర్సన్‌గా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, చైర్‌పర్సన్‌గా తిమ్మగానిపల్లి తిమ్మరాజమ్మ, వైస్ చైర్మన్‌గా దాసరి రామమోహన్ యాదవ్, మార్కెట్ కమిటీ సభ్యులుగా తలారి మంజుల, కంభం చాముండేశ్వరి, పి.నారాయణమ్మ, టీఎస్ సుమియా, సుగాలి మీనాక్షి, తెనగంటి బ్రహ్మయ్య, బాలా సోమశేఖర్, జి.లింగప్ప, రాయపాటి రామాంజినేయులు, ఎం.దివ్యతేజ, కె.వెంకటేశ్వర రెడ్డి, బుట్నా వెంకటేశులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

15,030 కేసులకు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23 బెంచుల్లో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 15,030 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. ఇరు వర్గాలు రాజీకి సమ్మతించడంతో 6,832 క్రిమినల్ కేసులు, 52 సివిల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులు (పంచాయతీ టాక్సు కేసులు, మునిసిపల్ ట్యాక్స్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు)8,106 , మోటారు వాహన ప్రమాద పరిహార 40 కేసులకు పరిష్కారం దక్కింది. ప్రమాదాల కేసుల్లో బాధితులకు రూ.3,30,12,000, సివిల్ కేసుల్లో రూ.98,33,271కు పైగా, ప్రిలిటిగేషన్ కేసుల్లో రూ.2,84,06,907ను కక్షిదారుల మధ్య రాజీ ఒప్పందం మేరకు న్యాయమూర్తులు ఇప్పించారు. లోక్ అదాలత్ నిర్వహణను జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి , కార్యదర్శి గరికపాటి దీనబాబు పర్యవేక్షించారు.

ఆమిద్యాలకు చేరిన ఉత్సవమూర్తులు



పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు ఉత్సవ మూర్తులను తరలిస్తున్న ఆలయ సిబ్బంది, అర్చకులు

ఉరవకొండ రూరల్: శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఆమిద్యాల గ్రామానికి చేర్చారు. మండలంలో ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచే స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభి షేకాలు నిర్వహించారు. ఈనెల 2న ఆమిద్యాల నుంచి ఉత్సవమూర్తులను పెన్నహోబిలం తీసుకురావడంతో ప్రారంభమైన ఉత్సవాలు.. తిరిగి ఆమిద్యాలకు చేరుకోవడంతో ముగిశాయి. గ్రామంలో ఉత్సవ మూర్తులకు భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పెన్నహోబిలేసుడి ఆలయానికి ఉత్సవ విగ్రహాలను చేర్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబాన్ని విమర్శిస్తే సహించం

- ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల హెచ్చరిక



అనంతపురం సెంట్రల్: వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబం అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలుసునని, అలాంటి కుటుంబంపై విమర్శలు చేస్తే నాలుక కోస్తామని టీడీపీ నాయకుడు ఎంఎస్ రాజును ఆర్టీసీ రీజనల్ పర్సన్ మాల్యవంతం మంజుల హెచ్చరించారు. శనివారం ఆర్టీసీ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ఎంఎస్‌రాజు స్థాయి తెలుసుకొని మసలుకోవాలని సూచించారు. వైఎస్ కుటుంబం పేరు ఉచ్చరించే అర్హత కూడా అతనికిలేదన్నారు. దళితుల సంక్షేమంపై చంద్రబాబునాయుడుకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని, 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా దళితులను అణగదొక్కారన్నారు. తండ్రి బాటలో తనయుడు నారా లోకేష్ వెళ్తున్నాడని, ఇటీవల పాదయాత్రలో దళితులను కించపరిచిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని, పార్టీలో, మంత్రి మండలిలోనూ పెద్దపీట వేశారని తెలిపారు. పైసలిస్తే ప్రెస్‌మీట్లు పెట్టే ఎంఎస్ రాజు వైఎస్ కుటుంబంపై విమర్శలు చేసే స్థాయిలేదన్నారు. దళితులను రాజకీయంగా అణగదొక్కిన చంద్రబాబునాయుడు..గత ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పారని, త్వరలో నీకు కూడా బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని ఈ సందర్భంగా ఎంఎస్ రాజును హెచ్చరించారు.

ఆ పార్టీల కూటమితో ఒరిగేదేమీలేదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

గుంతకల్లు: మునిగిపోయే పడవ లాంటి పార్టీ బీజేపీ అని, ఆపార్టీతో టీడీపీ, జనసేన జతకడితే ఒరిగేదేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ జగదీష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారన్నారు. బీజేపీపై ఏపీలోని 5 కోట్ల మంది ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గుర్తు చేశారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ప్రత్యేక ప్యాకేజీ లాంటి విభజన సమయంలోని హామీలను అమలు చేయలేదన్నారు. దీంతో బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జనసేన, టీడీపీలు సెక్యులర్ పార్టీలైన సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలతో జతకడితే లాభపడే అవకాశం ఉందన్నారు. ఈ మూడు పార్టీలు కలిసి పోటీపై సర్వేలు నిర్వహిస్తే గ్రాఫ్ పడిపోయిందని తెలిపారు. దేశంలో బీజేపీ మునిగిపోయే పడవ అని చెప్పడానికి కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి విద్యా సంస్థల్లో ఎస్సీ విద్యార్థులకు ఉచిత విద్య

రాప్తాడురూరల్: కేంద్ర ప్రభుత్వం 'శ్రేష్ట' పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు జాతీయస్థాయి విద్యా సంస్థల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 9వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఉచిత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సాయిరామ్ తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జూన్ 18న రాత పరీక్ష ఉంటుందన్నారు. మూడు గంటల పాటు జరిగే ఈ పరీక్ష (ఒక్కో ప్రశ్నకు 4 మార్కుల ప్రకారం 100 ప్రశ్నలు) 400 మార్కులకు రాయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు 2023 సంవత్సరంలో 8వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ వార్షికాదాయం 2.50 లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఈ నెల 21 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 25, 26 తేదీల్లో దరఖాస్తులో ఏవైనా మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. జూన్ 5న పరీక్ష కేంద్రాలను వెల్లడిస్తారన్నారు. జూన్ 14 నుంచి అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంచుతారన్నారు. 18వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రాత పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష ఇంగ్లిష్, హిందీ భాషల్లో మాత్రమే ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని అర్హులైన ఎస్సీ విద్యార్థులతో దరఖాస్తు చేసేలా అవగాహన కల్పించాలని డీఈఓ ఆదేశించారు.

పెళ్లికి రండి.. రక్తదానం చేద్దాం.. రారండి



వివాహం అనగానే .. బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులరాకతో సందడిగా ఉంటుంది. మేళతాళాలు, భాజభంత్రీలు హంగామా ఉంటుంది. తలంబ్రాలు, పెళ్లి మంత్రాలు, విందు, వినోదాలు ఉండనే ఉంటాయి. దాన ధర్మాలు అరుదుగా ఉంటాయి. అయితే కళ్యాణదుర్గం మండలం ముదిగల్లు గ్రామానికి చెందిన 'దుర్గం రక్తదాతల' వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల తిమ్మారెడ్డి వినూత్నంగా ఆలోచించాడు. తనకుమారుడు పాటిల్ ఉదయ్‌కుమార్ రెడ్డి వివాహం జి.కీర్తనరెడ్డితో ఆదివారం పట్టణ సమీపంలోని శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. ఇదే కళ్యాణ వేదిక సమీపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, రక్తదాన శిబిరంలో పాల్గొనాలని ఆయన పిలుపునివ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– కళ్యాణదుర్గం

క్లుప్తంగా

అభాగ్యునికి 'అమ్మ' ఆసరా



దివ్యాంగునికి కృత్రిమ కాలు అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్:అమ్మ సంస్థ ఓ దివ్యాంగునికి అండగా నిలిచింది. కృత్రిమ కాలు అందజేసి.. అతను నడవడానికి సాయ పడింది. నగర శివారులోని భద్రంపల్లికి చెందిన బేల్దారి లక్ష్మీనారాయణకు పెళ్లయి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత ఏడాది సెప్టెంబరులో ఓ రోడ్డు ప్రమాదంలో కుడి కాలు పోగొట్టుకొన్నాడు. అప్పటి నుంచి భార్య అపర్ణ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా దిగజారింది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి వెంటనే స్పందించి శనివారం లక్ష్మీనారాయణకు రూ.40 వేలు విలువ చేసే కృత్రిమ కాలు అందించారు. రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను కూడా ఇచ్చారు. బాధితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు మరింతమంది దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: అనంతపురంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. అనంతపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని 169 ఐపీసీ కేసులు, 1435 న్యూసెన్స్ కేసులను రాజీ మార్గంలో న్యాయమూర్తి పరిష్కరించారు. కేసుల పరిష్కారానికి చొరవ చూపిన పోలీసు సబ్ డివిజన్ సిబ్బంది కృషి అభినందనీయమని డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయొద్దు



డ్రైయినేజీ సమస్యపై చర్చిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయరాదని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. సాయినగర్ రెండో క్రాస్‌లో డ్రెయినేజీ బ్లాక్ కావడంతో కమిషనర్ పరిశీలించారు. డ్రెయినేజీపై నిర్మాణాలు చేపట్టడంతో పూడిక తొలగించలేని పరిస్థితి నెలకొందని సిబ్బంది కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. పూడిక తీసి మురుగు ముందుకు వెళ్లేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా చెత్తను డబ్బాల్లో వేసి.. చెత్తబండి వచ్చినప్పుడు అందజేయాలన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్లు బాలాంజినేయులు, సైపుల్లాబేగ్, టీపీఓ మహబూబ్‌జాన్, తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బొప్పరాజు



కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

అనంతపురం అర్బన్: జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని ఆమె క్యాంపు కార్యాలయంలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంఘం రెండో ప్రాంతీయ సదస్సు నిర్వహణపై నాయకులతో చర్చించేందుకు ఆయన అనంతకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట జేఏసీ జిల్లా చైర్మన్ దివాకర్ రావు, తదితరులు ఉన్నారు.


కొనసాగుతున్న చెస్ టోర్నీ



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

అనంతపురం: అనంతపురంలోని రెయిన్‌బో మాంటిస్సోరి ప్రీ-స్కూల్‌లో ఆలిండియా చెస్ ఫెడరేషన్, వరల్డ్ చెస్ ఫెడరేషన్ సంయుక్త సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ చెస్ ఫర్ ఎవరీవన్ ఫైడ్ రేటెడ్ చెస్ టోర్నమెంట్-2023 రెండో రోజు శనివారం కొనసాగింది. ఆరో రౌండ్ పోటీలను ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కేర్ అండ్ క్యూర్ సీఈఓ అభిలాష్‌రెడ్డి, అమ్మినేని ఉదయ్‌కుమార్‌నాయుడు తదితరులు ప్రారంభించారు. క్రీడాకారులు పోటాపోటాగా చెస్ ఆడారు.







సాయంకాలం..అద్భుత దృశ్యం

సూర్యోదయం, సూర్యాస్తమయ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. ఎత్తయిన, ప్రశాంతంగా ఉండే ప్రదేశాల నుంచి వీటిని వీక్షించడం మరింత ఆనందాన్నిస్తుంది. ప్రస్తుతం అనంతపురం టవర్‌క్లాక్ వద్ద ఫ్లైఓవర్ పనులు చివరిదశకు చేరాయి. ఇప్పటివరకు పూర్తయిన బ్రిడ్జిపైకి జనం చేరుకుని నగర అందాలను వీక్షిస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం పూట ఈ ప్రాంతం కిటకిటలాడుతోంది. శనివారం సాయంత్రం సూర్యాస్తమయ దృశ్యాలను జనం వీక్షిస్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

జయ హనుమాన జ్ఞానగుణ సాగర..

• హనుమజ్జయంతికి ఆలయాల ముస్తాబు

అనంతపురం కల్చరల్:హనుమజ్జయంతి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. పెద్దఎత్తున తరలివచ్చే భక్తులకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి విశేష అభిషేకాలు, ఆకుపూజలు, హోమాలు, ఊరేగింపులు జరగనున్నాయి. తపోవనంలోని శ్రీశివశక్తి బాబా ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు మూడురోజుల పాటు కొనసాగుతాయి. ఆది, సోమవారాలలో సుందరకాండ పారాయణం, సహస్రనాగవల్లి దళార్చన, మంగళవారం సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. కోర్టురోడ్డులోని వరదాంజనేయస్వామి, ఇందిరానగర్, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లోనూ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల వేడుకల్లో భాగంగా హౌసింగ్ బోర్డులోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉదయం సామూహిక హనుమద్ వ్రతం జరిగింది. సాయంత్రం 1008 మందితో చాలీసా పారాయణం చేశారు.



హనుమంతుడి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తురాలు

వేడుకలు ప్రారంభించిన ఎమ్మెల్యే తోపుదుర్తి

అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకులు ప్రమోద్ మాట్లాడుతూ ఈ ఏడాది మరింత వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



సోములదొడ్డిలో అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

మట్కా బీటరు అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాణీనగర్‌లో మట్కా బీటర్ లక్ష్మీనారాయణను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మట్కా చీటీలతోపాటు రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా మట్కా కంపెనీకి సంబంధించిన డబ్బు తనతో షేక్ జిలాన్ అనే వ్యక్తి కట్టించుకుంటాడని చెప్పినట్లు పోలీసులు చెప్తున్నారు. దీంతో పోలీసులు కంపెనీతో సంబంధాలు నెరుపుతూ నగరంలో బీటర్లను ఏర్పాటు చేసుకున్న షేక్ జిలాన్ కోసం వెతుకుతున్నామని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

భర్త వేధింపుల నుంచి రక్షించండి:

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాణీనగర్‌కు చెందిన రుబీనా, ఖాజాపీరా దంపతులు. వీరికి ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. అనుమానంతో భార్యను వేధిస్తుండటంతో విసిగిపోయిన రుబీనా పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ జయంతికి ముస్తాబు



రాయలచెరువులో అభయాంజనేయ స్వామిని పూలతో అలంకరించిన దృశ్యం



రాయలచెరువులో విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

యాడికి: హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని రాయలచెరువులో ఏటా హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ఉదయం నుంచి గ్రామంలోని చందన రైల్వే గేట వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు ప్రారంభించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరిం చారు. రెండు రోజుల పాటు పూజలు, హోమాలు చేస్తారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బాబు గౌడ్, పాండురంగడు తెలిపారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని ముకుందాపురం, కల్లూరు, పెనకచెర్ల డ్యాం, బూదేడు, పాపినేపాళ్యం, క్రిష్టాపురంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆలయాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే ముకుందాపురంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి రాష్ట్రస్థాయి తాళాల భజన పోటీలు నిర్వహించారు.

నేడు రథోత్సవం

పామిడి: పట్టణ తలవాలకట్ట కోట వీధిలోని కోట వరాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ జయంతి, రథోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో కోరారు. అలాగే రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రథోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

భద్రావతి భావనా రుషీశ్వరులకు పూజలు

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డు సమీపంలోని మార్కేండేయ స్వామి ఆలయంలో భద్రావతి భావనా రుషీశ్వరుల కల్యాణ ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శనివారం ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, క్షీరాభిషేకం అనంతరం ప్రత్యేక పూలతో స్వామిని అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బహుత్తమ పద్మశాలీయ సంఘ కమిటీ ధర్మకర్త చెన్నా సూర్యనారాయణ, అధ్యక్షుడు గద్దం గణేష్, వైస్ ప్రెసిడెంట్స్ రంగప్రసాద్, రవికుమార్, జాయింట్ సెక్రటరీ గద్దం పరమేశ్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి హరికృష్ణ పాల్గొన్నారు.



అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు గాయాలు

గార్లదిన్నె: మండల పరిధిలోని తిమ్మంపేట సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ విధుల్లో భాగంగా కల్లూరుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. సంఘటన స్థలం వద్దకు రాగానే రోడ్డుపై పాము అడ్డుగా వచ్చింది. పామును తప్పించబోయి ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో సాయికుమార్ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు.

గుత్తిలో..

గుత్తి: పట్టణంలోని కేంద్రియ విద్యాలయం సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. రాతన గ్రామానికి చెందిన రామన్న వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరాడు. కేంద్రియ విద్యాలయం సమీపానికి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో రామన్న గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయికుమార్

ఎస్పీని కలసిన రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే

కొత్తచెరువు: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డిని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి శనివారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ధ్యానంపై అవగాహన

తాడిపత్రి టౌన్: స్థానిక శివాలయం వీధిలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో జరుగుతున్న ఉచిత ధ్యాన ప్రత్యేక తరగతులు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి ఉచిత ధ్యాన ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి. ధ్యాన కేంద్రం నిర్వాహకులు రంగనాథరెడ్డి, కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి 10 వరకూ విద్యార్థులతో ధ్యానం చేయించారు. ధ్యానం, ప్రాణాయామం, మానవత విలువలు, ఆహార అలవాట్లు, గురువులు, పెద్దల పట్ల భక్తి భావంతోపాటు భగవద్గీత, ఆటలు, పాటలు, క్విజ్, డ్రాయింగ్, పెయింటింగ్‌పై అవగాహన కల్పించారు.

భక్తులతో ఖాద్రీ ఆలయం కిటకిట

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా చిత్తూరు, అనంతపురం వైఎస్సార్ జిల్లాలతోపాటు కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీఖాద్రీశుని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చింతల రాయుడి సేవలో ధర్మవరం సబ్ జడ్జి

తాడిపత్రి టౌన్: స్థానిక చింతల వెంకటరమణ స్వామి ఆలయాన్ని శనివారం ధర్మవరం సబ్ జడ్జి గీతావాణి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చింతల వెంకటరమణ స్వామి, ఆనందవల్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయంలోని శిల్ప సంపదను తిలకించారు. కార్యక్రమంలో తాడిపత్రి రూరల్ సీఐ చిన్న పెద్దయ్య దంపతులు, ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



చింతల వెంకటరమణ స్వామికి పూజలు చేయిస్తున్న ధర్మవరం సబ్ జడ్జి గీతావాణి

కొడవలితో బెదిరించి ఆటో ఎత్తుకెళ్లిన దొంగ

• 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

లేపాక్షి: ఓ గుర్తు తెలియని వ్యక్తి హిందూపురం పట్టణంలో ఓ ఆటో డ్రైవర్ కళ్లలోకి కారం పొడి చల్లి, కొడవలితో బెదిరించి, ఆటో ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం లేపాక్షి మండలం పులమతి పంచాయితీ పరిధిలోని లయోలా పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం హిందూపురం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న రహమత్‌పురానికి చెందిన ఫకృద్దీన్ అనే ఆటో డ్రైవర్ వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వెళ్లి హిందూపురం రూరల్ మండలంలోని కొటిపికి వెళ్లడానికి ఆటోను బాడుగకు మాట్లాడుకున్నాడు. లయోలా పాఠశాల సమీపంలోకి వెళ్లగానే గుర్తు తెలియని వ్యక్తి డ్రైవర్ కళ్లలోకి కారం పొడి చల్లి ఆటోను తీసుకెళ్లాడు. ఆటోడ్రైవర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మునీర్ అహమ్మద్ కేసు నమోదు చేసుకుని 24 గంటల్లోపు ఆటోతో పాటు ముద్దాయిని పట్టుకున్నారు. ముద్దాయి లేపాక్షి మండలం మానేపల్లికి చెందిన పిటి.ప్రసాద్ (20)గా గుర్తించారు. అయితే ముద్దాయి తన పొదుపు సంఘం డబ్బులు రూ.2 లక్షలను వ్యసనాలకు ఖర్చు చేసినట్లు నేరం అంగీకరించాడు. ముద్దాయిని ఆరెస్ట్ చేసి ఆటో నం.ఏపీ39 టీఎక్స్ 3044ను, కొడవలి, కారం పొడి ప్యాకెట్లు సీజ్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

రామరాజుపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

యాడికి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామని రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి దేవరాజన్ తెలిపారు. మండలంలోని రామరాజు పల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యుడు దేవరాజన్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్: స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు జూన్ 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

రవిశంకర్ గురూజీ బోధనలు అనుసరణీయం

అనంతపురం కల్చరల్: యోగా గురువు రవిశంకర్ బోధనలు అనుసరణీయమైనవని వక్తలు అన్నారు. రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు శనివారం స్థానిక ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటరులో ఘనంగా జరిగాయి. సెంటర్ నిర్వాహకులు కర్నాలు మమత మాట్లాడుతూ సాధన, సేవ, సత్సంగం తదితర ప్రధాన అంశాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్న రవిశంకర్ గురూజీ మానవ జీవితంలో సమూల మార్పులు తెచ్చారని కొనియాడారు. జ్ఞానం, గానం, యోగా, వ్యాయామాలతోనే మనిషి ఆనందంగా జీవించగలరన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక, యోగా సంస్థల ప్రతినిధులు దేవరకొండ కౌసల్య, చలపతిరెడ్డి, సుబ్రమణ్యం, కరణం లక్ష్మీశ్రీధర రావు, మేకా జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి'

అనంతపురం అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ చైర్మన్ బ్రిజ్ భూషణ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద తలకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ దేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహిళా రెజ్లర్లపై బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పతున్నట్లు ప్రధానికి ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. దీన్నిబట్టి చూస్తే మహిళలపై బీజేపీ ప్రభుత్వానికి ఏపాటి గౌరవం ఉందో స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా ఎంపీపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌కృష్ణ, శ్రీనివాసులు, దేశ, శ్రీకాంత్, రాజు, చాంద్‌పీరా, షెక్షా, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంపై సంబరాలు



కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

అనంతపురం: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంపై ఎస్కేయూనివర్సిటీ వద్ద ఆ పార్టీ అనుబంధ ఎన్ఎస్‌యూఐ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయం తథ్యమని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ పులిరాజు ధీమా వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి వర్గాలకు అండగా ఉంటుందనే నమ్మకంతోనే కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సునీల్, సుధీర్, తిరుపాల్, నరేష్, శ్రీను, అంజి, వీర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి ఎలీట్ విద్యార్థుల ప్రభంజనం



జి.ఆర్య

రాప్తాడు: పదో తరగతి సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో మాంటిస్సోరి ఎలీట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ ఏడాది 187 మంది ఆ పాఠశాల విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన విద్యార్థి జి.ఆర్య 500 మార్కులకు 480 మార్కులు సాధించాడు. మరో ఐదుగురు విద్యార్థులు 95 శాతం, 40 మంది విద్యార్థులు 90 శాతం, 140 మంది విద్యార్థులకు 80 శాతంపైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. అందరూ ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణత సాధించడంతో ఆ పాఠశాల ఎండీ కృష్ణభరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీరా, ప్రిన్సిపాల్ ప్రతాపరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన వల్లనే ఈ ఫలితాల సాధించగలిగామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.